# గుండె చప్పుళ్ళు

కొడుమంటి కాశీపతిరావు

కీచురాళ్ళు గీమని తెంపు లేకుండా అరుస్తున్నాయి. ఆ అరుపు వింటుంటే ఇప్పటికే మనసులో వున్న గాభరా పదిరెట్లుగా పెరిగిపోతూంది. గుమ్మాని కెదురుగా కుర్చీ వేసుక్కూచున్న నాకు గుమ్మంలోంచి వీధిలోకి చూస్తూంటే ఇంకా చీకటే కన్పిస్తూంది. ఆ చీకటి చూస్తున్న కొద్దీ పదిరెట్ల గాభరా గబ గబా ఇరవై రెట్లయి పోతూంది.

"అవునే...సత్యవతీ...వీడింకా రాలేదేవిటి .." అనడిగేను నా గాభరా పంచుకోవడానికి.

"వెర్రి వెధవ... ఎప్పుడే ఊరెళ్ళినా చీకటి పడకముందే వాలేవాడింట్లో విశాఖపట్నం వెళ్తే మరీనూ...ఈ రోజు ఏవిటో ఇంకా రాలేదు..." వెర్రి వెధవ పేరు చెప్పి నాకు మరింత వెర్రెక్కిస్తున్నది.

"సరాసరి...వచ్చేస్తాదులేగాని...నువ్వెళ్ళి పడుకో....నేనిక్కడే మంచం వేసుకుని నడుం వాలుస్తాను." అంటూ లైటార్పేసేను.

నాకు మాత్రం దాని సొదకంటే కీచురాళ్ళ రొదే నయమని పించింది. ఆ క్షణానికి, కాని అది వెళ్ళిపోయి దాని మా నాన్న ఆ డిటో కురుపెట్టు కుంటూ పడుకునేసరికి మళ్ళీ వీడి మీదికి ధ్యాస మళ్ళింది.

నా కొడుకని చెప్పడం కాదుగాని భార్గవది అచ్చం నా పోలికే. మనిషి రూపురేఖల్లోనే కాదు. గుణగణాల్లో కూడాను. పాళాబంగారం. అందుకే ఎవడెత్తుక పోతాడేమోనని కాదూ ఈ గాభరా అంతానూ.



ఎమ్మే చదువుకున్నాడు. వయసొచ్చింది. వాడి మావయ్య విశాఖపట్నంలో ఏదో సంబంధం చూసేడు. పిల్లనిచ్చి పెళ్ళిచేయడమే కాకుండా ఉద్యోగం వేయించు కుంటార్ట.

వాడి ఉద్యోగం కోసం ఎన్ని పుర్రాకులు కుడుతున్నాడు! బిసీ అని, ఏబీ సీడీ లనీ, ఎస్సీ అనీ ఎస్టీ అదీ అన్నింటికీ ఇన్నిన్ని పంచేస్తే మిగిలే పోస్టులెన్ని? అయితేభగవంతుడు మనయందు ఉండ బట్టీ, గొప్ప పుటక పుట్టాడు గాబట్టీ... ప్రభుత్వం కూడా మనదే గాబట్టీ ఏ సిఫారసుల్తోనో ఉద్యోగం సంపాయించి గల్డు. ఆ సదుపాయం ఆ ఎస్సీలకేదీ?

ఇకపోతే ఏ సంబంధం ద్వారానైనా కట్నం చేతికొస్తే పిక్సడులో వేయిం చేసెయ్యాలనీ అసలు వాడిచ్చైనా పడ్డీతో మా ముసలి ప్రాణాలు రెండు కాలక్షేపం చేసెయ్యాలనీ వుంది. కాని బావమరిది విశాఖపట్నం సంబంధం గురించి ఓ మహా ఇదిగా చెప్పేడు. మరందుకే కదా ఇష్టం వున్నా లేకపోయినా భార్గవని పంపించేను.

ఏ వేళ కొస్తాడో ఏమో...హాయ్....అని ఆవలింతలు తీసుకుంటూ నడవ లోనే నడుం వాల్చేను. అంతే నిద్రపట్టేసింది,

ఎవరోలేపుతూంటే ఉలిక్కిపడి నిద్రలేచేను, మంచి నిద్రలో లేచేనేమో గుండెలు దడదడమంటున్నాయి. దానికి తోడు ఎదురుగా మా వాడి ఫ్రెండు రాంబాబుని చూసేసరికి గడగడలాడిపోయేను. చుట్టూ చూస్తే తెలతెలవారుతోంది? తెల్లారినా భార్గవ రాలేదన్న నిజం ముందు కనిపించగానే మరింత గాభరా పడిపోయేను.

"ఏవిరా...రాంబాబూ తెల్లారే వచ్చేవు?" అనడిగేను ఆత్రుతగా

"మీ వాణ్ణెవరో హైజాక్ చేశారండీ..." అన్నాడు.

వాడేం విమానవా....బస్సా....హైజాక్ చేసిడానికి అని ఒక్క లిప్తపాటు తమాషాగా నవ్వుకున్నా....వాడంత కన్నా విలువైనవాడు. పాళాబంగారం. అలాంటి వాణ్ణెవరో ఎత్తుకుపోయారని అర్ధం కాగానే నిద్రమత్తు జారిపోయింది.

"ఏమ్మిటా నువ్వు చెప్తున్నదీ...సరిగా చెప్పేదువు..." అన్నాను.

"నిన్నను...రాత్రి పది గంటల బస్సులో మీవాడు తిరిగొస్తున్నాడట.... మా పిన్ని విశాఖపట్నం పెళ్ళికి వెళ్ళిందలెండి. ఆవిడా ఆ బస్సులోనే వుంది. తగరపు వలస దాటేక ఒకమ్మాయి బస్సు నాపేసిందిట. ఆపేసి భార్గవని బల వంతాన దింపేసిందిట. వీడికి ఆ అమ్మాయికీ ఘర్షణ కూడానట. తను రానని వీడు మొండిపట్టూ....నువ్వు రాకపోతే బస్సు కదల్దని ఆ అమ్మాయి బెదిరింపూ నట. చివరికి మీ మండి మా కాలక్షేపమై పోతూంది. దిగవయ్యాబాబూ అని ప్రయాణీకులే దించేసేరుట," అని టాలతో వివరించేడు.

"ఓరి నీ అఘాయిత్యం కూలిపోనూ....అమ్మాయిలు అబ్బాయిల్నెత్తుకు పోవడమేవిటి కలికాలం కాకపోతే. .." అన్నాను బేజారుగా "అయినా ఆ అమ్మాయి ఎవరంటావురా రాంబాబూ..." అనడిగేను.

"అదే నాకూ తెలియకుండ వుందండీ ...అమ్మాయిలంటే ఆమడ దూరం పోతాడు.....అలాంటి వాడిని కాకపోతే నాలాంటి వాడి నెత్తుకపోకూడదూ...." అంటూ నవ్వి "వాడికా అమ్మాయి ఏ మాత్రం తెలిసి ఉండకపోతే అంత అధి కారంతో బస్సు దింపేస్తుందీ?" అన్నాడు రాంబాబు.

నిజమే అనిపించింది. కాని ఏం చేయాలో తోచలేదు.

"పోలీసు రిపోర్టు ఇద్దామంటరా?" అని రాంబాబు ఆలోచన చెప్పేడు.

అంత వరకు వెర్రిదానిలా మా ఇద్దరి ముఖాలు మార్చి మార్చి చూస్తున్న మా ఆవిడ అప్పటికి మాత్రం నోరువిప్పి బొంగురు పోయిన గొంతుతో "ఆ పని వెంటనే చెయ్యండి బాబూ" అంది,

గాభరా వస్తున్న నిబ్బుచ్చుకోట నిలవనీయడం లేదు. నిజమే కానీ కట్టంత కుర్రాడు. ఏమని రిపోర్టు చేస్తాం? సబబేమీ కన్పించలేదు.! చూద్దాం. ఏ టైముకైనా రాక పోతాడా?

"చూద్దాంరా....రాంబాబూ ఏదైనా పనిమీద వెళ్ళాడేమో....తొందరపడి పోలీసు రిపోర్టిస్తే అభాసవుతుంది..." అన్నాను

"ఏం పనండీ బాబూ....ఓ అమ్మాయి దింపేసిందని నేను చెబుతుంటేనూ...." అన్నాడు విసుగ్గా రాంబాబు.

"సరే అమ్మాయే దింపేసింది....కాని ఆ అమ్మాయింట్లో ఎన్నాళ్ళుంటాడూ వాళ్ళెంతకాలం ఉంచుకోగలరు;"

మీ ఖర్మ అన్నట్లు నావేపు ఓ చూపుచూసి వెళ్ళిపోయాడు రాంబాబు.

ఇంక మొదలెట్టింది,

"ఇదేం ఖర్మరా నాయనా....చీకటి పడితే ఎక్కడా ఉండని వాడివి....ఏం చేస్తున్నావురా తండ్రీ...."

"ఊరుకోవే... అయ్యో ఊరుకోమంటూంటే....వాడేమైనా ఆడపిల్ల గనకనా నా మానమర్యాదలు పోతాయని భయపడ్డానికి. వెళ్ళు వెళ్ళు—వంట ప్రయత్నం చూడు...ఆకలిమీద వస్తాడేమో...." అన్నాను.

అస్త్రం పనిచేసింది

కాని నా మనసు మనసులో లేదు. గుండె గుండెలో లేదు. నాకు తెలుసు వాడచ్చం నా పోలికేనని. వాడేం ఆడపిల్లకాదని సరిపెట్టేసేను కాని ఆడపిల్ల మనస్తత్వం వాడిది.

కళ్ళు మూసుకున్నాను

భగవంతుని ప్రార్థించేను మౌనంగా

"వాడు శుభంగా సుఖంగా తిరిగొస్తే తల నీలాలు సమర్పించుకుంటాను స్వామీ..." అని కూడా బేరం పెట్టేను.

మరంచేత మనసు ఊరట చెందింది.

లోపలికి వెళ్ళి స్నాన పానాదులు ముగించుకొని బయటకు వచ్చి చూద్దును. గుమ్మం దగ్గర వెంకట్రవణమూర్తి సాక్షాత్కరించేరు పద్మావతితో కూడా.

ఇదేవిటీయన దిగబడ్డాడు. మా వాడు తిరిగి రావాలని కదా ప్రార్థించేను. ఈయనిలా అర్థం చేసుకున్నాడేమిటి కొంపదీసి....అనుకుంటూనే తేరిపార చూసేను గుమ్మం ఫ్రేము కట్టినట్లు బారెడు బారెడు పూలదండలు వేసుకుని... ఇంత లింతలు కళ్యాణ తిలకాలతో నిలబడి వున్నారు. కాని...

వెంకట్రమణమూర్తిలా లేడే. మా భార్గవ పోలికలు కనిపిస్తున్నాయి. వాడేనా అవును వాడే.

ఓ క్షణం ఆనందం ఉప్పొంగిపోయింది. ఆంతెత్తున పొంగిన కెరటాలా వెనక్కి గబగబా తీసేసేయి.

పిల్లి పెళ్ళి చూపులకు వెళ్ళి రమ్మన్నానా.... పెళ్ళి చేసుకు రమ్మన్నానా.....

ఒసేవ్ సత్యవతీ ...ఇలా వచ్చి చూడు... "అని ఓ గావుకేక పెట్టేను గాభరాతో.

అది లోపలినుండి పరిగెత్తుకువచ్చి...."నా బాబే...నా బంగారుకొండే..." అంటూ ఆనంధంతో వాణ్ణి తడుముతూంది.

"నీ కొడుకు బంగారమే గాని...ఆ ప్రక్క నున్నదెవరో కాస్తచూడు...." అన్నాను కాస్త కటువుగా.


"మహాలక్ష్మిలా వుందండీ...." అంటూ మెటికలు విరిచింది

"ఏవిరా....ఏవిటి వాలకం... " అని అడిగేను,

"అవున్నాన్నగారూ...పెళ్ళి చేసుకున్నాను రాత్రి.

"కనిపిస్తూనే వుంది గానీ...ఎవరూ... ఏవిటీ....ఎంత కట్నం....ఎవరు చేసేరు....మీ మావయ్య సంగతేవిటీ...." అంటూ ప్రశ్నల వర్షం కురిపించేను.

"మావయ్య వైజాగులో వున్నాడు. అయన చూసిన సంబంధమూ అక్కడే వుంది! ఈ అమ్మాయిది దగ్గర పల్లెటూరు, వీళ్ళ నాన్న ఓ రైతు. కట్నాలు కానుకలూ ఏవీలేవు. ఇద్దరమూ ప్రేమించుకున్నాము. ఈ విషయం చెప్తే మీ



కర్థంకాదు అని ఇలా పెళ్ళిచేసుకు వచ్చేను...." అన్నాడు మొహంమీద గుద్దినట్టు.

మరి మా గతేవిటీ వాడుద్యోగంచేసి తెచ్చిన రాళ్ళతో మమ్మల్ని చూస్తాడా ఏవన్నానా....కట్నం డబ్బుతో కాలం గడుపుతున్నాం అని తప్పు కోవడం ఎంత దర్జాగా వుంటుందీ....వీడికెలా అర్థం అవుతుంది.

నా మనసులోని మాటలు చదివేసి నట్టున్నాడు.

"కొడుకు తెచ్చిన కట్నంతో కాలం గడుపుదామనుకోవడం దారుణం నాన్నగారూ.... అభిమానం కలిపిన అన్నం పెట్టి పెంచేరునన్ను. అటువంటి మీకు ఒకర్ని పిండి తెచ్చిన రక్తపుకూడు తినిపించలేను. నా కొడుకు నన్ను పువ్వుల్లో పెట్టుకు చూస్తున్నాడని దర్జాగా చెప్పుకునేట్టు చేస్తాను. నన్ను నమ్మండి నాన్నగారు...." అన్నాడు వాడు.

"ఆఁ ఇంతవరకూ ఉద్యోగానికి ఠికాణాలేదు గానీ...." అన్నాను ఈసడిస్తూ.

"వైజాగు వెళ్ళింది ఉద్యోగ ప్రయత్నము కోసమే నాన్నగారూ. మావయ్య దగ్గర కాకుండా మా ఫ్రెండు దగ్గరికి వెళ్ళి ప్రయత్నించేను. ఈ వారంలో ఆర్డర్సు వస్తాయి. అమ్మా నువ్వైనా నాన్నగారికి బోధపడేట్టు చెప్పమ్మా..."

ఇదొకటి....నాకు చెప్పేది.

"కట్నం గుంజాలనే చూస్తున్నారు గానీ...లేనిపోని తంతుల గురించి ఆలోచించేరూ. మధ్య తరగతి మొహర్బానీలకు చేసే ఖర్చులన్నీ వీడు తగ్గించేడు. పెళ్ళిళ్ళతో అనారోగ్యంతో పాటు అప్పులబారాన్ని ఇప్పటివాళ్ళు పెంచుకుంటున్నారు. అటువంటిది ఎంతో ముందు చూపుతోనూ ఆదర్శంతో పెళ్ళి చేసుకున్నాడు. మన ముసలిపొట్టలకి ఎంత కావాలండీ....ఆ పాటిదానికి వీడు చూడడని ఎందుకనుకుంటున్నారూ..." అంటోంది సత్యవతి.

ఎందుకో తెలియకుండా కళ్ళు మండుతున్నాయి. అది కన్నీళ్ళకు సూచన అని తెలిసే లోపల నా కళ్ళని ఎవరో మెత్తగా తాకుతున్నారు. ఆ మృదువైన స్పర్శ నా గుండెనీ తాకింది. కిందికి చూస్తే వీడూ, ఆ పిల్లా నా కాళ్ళకు నమస్కరిస్తూ మసగ మసగ్గా కన్పిస్తున్నారు.